సాక్షి రంగారెడ్డి

ఆదివారం ı 19 ı మే ı 2024



ఆయిల్‌పామ్‌పై అవగాహన

పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ లబ్ధిపొందాలని వక్తలు రైతులకు సూచనలు చేశారు. 8లో▸



డీసీఎం వాహనం బోల్తా

మొక్కజొన్న లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటన కందుకూరు ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸



శంకర్‌పల్లిలో చందన బ్రదర్స్

తెలంగాణ ప్రజలకు ఎంతో సుపరిచితమైన ప్యాట్నీ సెంటర్ చందన బ్రదర్స్.. శంకర్‌పల్లిలో కొత్త బ్రాంచిని ప్రారంభించింది. 8లో▸

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జూన్ 9న జరగనున్న గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ శశాంక వెల్లడించారు. ఈ మేరకు శనివారం టీఎస్పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 93 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 55,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్ష జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అప్రమత్తంగా ఉండాలి



ఇబ్రహీంపట్నం: ధాన్యం సేకరణ ఓ యజ్ఞంలాంటిదని, కొనుగోలు పూర్తయ్యే వరకు పీఏసీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైస్ మిల్లుల నుంచి తగిన రసీదులు పొందాలని సూచించారు. అంతేగాక రైతుల వద్ద నిర్ణీత పరిమాణంలోనే వడ్లను సేకరించాలని స్పష్టం చేశారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు పూర్తి పారదర్శకంగా జరగాలని, ఏ మాత్రం అనుమానాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎన్ని ట్రక్‌ల ధాన్యం.. ఏయే మిల్లులకు వెళ్లింది అనే దానిపై ఆరా తీశారు.

సదరం.. సతమతం

- సీహెచ్‌సీల్లో క్యాంపులకు ససేమిరా
- స్పెషలిస్టులు, టెక్నీషియన్లు, వైద్య పరికరాలు లేని ఫలితం
- మారుమూల ప్రాంతాల్లో బాధితులు
- దూరంగా నగరంలో శిబిరాలు
- అర్హత పొందినా దివ్యాంగులకు అందని పెన్షన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సదరం క్యాంపుల ఏర్పాటు ప్రతిపాదన ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. గ్రేటర్‌కు శివారు ప్రాంతాల్లో ఉన్న చేవెళ్ల, షాద్‌నగర్, హయత్‌నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, మారుమూల మండల కేంద్రాల్లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు స్పెషాలిటీ వైద్యులు విముఖత చూపుతుండటంతో పాటు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టులు ఉన్నా.. వారు కూడా రోజువారీ ఓపీ, ఐపీ రోగులతోనే బిజీగా మారుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారు సదరం క్యాంపులకు హాజరుకావడం కష్టంగా మారింది. దీంతో మారుమూల ప్రాంతవాసులు సైతం నగరంలోని కొండాపూర్, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రులకు రావాల్సి వస్తోంది. దూరతీరాలను దాటుకుని వచ్చిన దివ్యాంగులకు తీరా అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతోంది. కొత్త సర్టిఫికెట్లు, రెన్యూవల్స్ కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. జిల్లాలో 62,215 మందికిపైగా సదరం క్యాంపులకు దరఖాస్తు చేసుకున్నారు. వైద్య పరీక్షల్లో 45,506 మంది 60 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వాన్ని పొంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 27,619 మంది మాత్రమే నెలవారీ పెన్షన్ పొందుతున్నారు. మరో 17,887 మందికి నిరీక్షణ తప్పడం లేదు. వారంతా తమకు పెన్షన్ ఇప్పించాల్సిందిగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నిపుణులు లేరు.. వైద్యపరికరాలు లేవు

క్యాంపులకు ఈఎన్‌టీ సహా కంటి వైద్యనిపుణుడు, మానసిక వైద్య నిపుణుడు, ఎముకల వైద్యుడు తప్పనిసరి. 60 శాతం వికలాంగత్వం ఉన్న వారు మాత్రమే పెన్షన్‌కు అర్హులు. సర్జరీల ద్వారా తక్కువ వినికిడి లోపం, దృష్టి లోపం, అవయవలోపం ఉన్న వారికి లోపాలు సరిదిద్దుకునే అవకాశం ఉంది. ఇలాంటి వారి గుర్తింపు విషయంలోనే సమస్యలు తలెత్తుతుంటాయి. ఇందుకు నిర్దిష్టమైన వైద్యపరికరాలు అవసరం. వాటిని ఆపరేట్ చేయాలంటే వైద్యులతో పాటు టెక్నీషియన్లు అవసరం. యంత్రాలను ఒకచోటి నుంచి మరో చోటికి తరలించడం అంత సులభం కాదు. సురక్షితం అసలే కాదు. ఇలాంటి పరిస్థితుల్లో మండలాల వారీగా క్యాంపుల నిర్వహణ ఇబ్బందిగా మారనుంది. అంతేకాదు స్పెషాలిటీ వైద్యులంతా నగరంలోనే ఉంటున్నారు. వీరికి ఇచ్చే పారితోషికం కూడా చాలా తక్కువ. దీంతో మారుమూల ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు నిర్వహించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు మండల కేంద్రాల్లో సదరం క్యాంపులు నిర్వహించాలని జిల్లా యంత్రాంగం భావిస్తున్నా.. ఆ మేరకు అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వారు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఇప్పటికే వనస్థలిపురం, కొండాపూర్ ఏరియా ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న క్యాంపులకు స్పెషాలిటీ వైద్యులను రప్పించడం కష్టంగా మారింది. ప్రభుత్వ నిపుణులు లేకపోవడంతో గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన అమయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని, ప్రైవేటు వైద్యులకు ఇన్సెంటివ్ ఇచ్చి క్యాంపులు నిర్వహించారు. అది కూడా కొద్ది రోజులే కొనసాగింది. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఈ క్యాంపుల అంశాన్ని పట్టించుకోవడమే మానేశారు. మండల స్థాయిలో క్యాంపులు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా తుంగలో తొక్కేశారు. విధి లేని పరిస్థితుల్లో బాధితులు కొండాపూర్, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వికలాంగ సర్టిఫికెట్ వచ్చినప్పటికీ చాలా మందికి ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాకపోవడంతో వారంతా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణికి అందుతున్న ఫిర్యాదుల్లో మెజార్టీ ఈ కోవకు చెందినవే ఉండటం గమనార్హం.

జిల్లాలో ప్రధాన ఆస్పత్రులు

ఆస్పత్రి	పడకల సామర్థ్యం
కొండాపూర్ ఏరియా ఆస్పత్రి	100
వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి	100
చేవెళ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్	50
షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్	50
హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్	50
మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్	50
రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్	50

జిల్లాలో దివ్యాంగులు ఇలా..

వికలత్వం	దరఖాస్తుదారులు	అర్హత పొందిన వారు	పెన్షన్ పొందుతున్నవారు
లోకోమోటార్/ఓహెచ్	42,998	31,003	18,557
అంధత్వం	7,490	4,877	2,628
వినికిడిలోపం	5,664	3,659	2,367
బుద్ధి మాంద్యం	4,960	4,887	3,024
మానసిక అనారోగ్యం	1,049	1,027	630
మల్టిపుల్ వికలాంగత్వం	54	53	31



జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో తడిసి ముద్దయిన ధాన్యం

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చుతోంది. చేతికొచ్చిన వరి పంట గాలివానకు నేలకొరిగిందని, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, మామిడి కాయలు నేలరాలాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కురిసిన వర్షానికి పంట నూర్పిడి చేసి ఆరబెట్టిన వరి ధాన్యం నేలపాలైందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

– కొందుర్గు

వర్షాకాల ప్రణాళికకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాల ప్రణాళికకు సన్నద్ధంగా ఉండాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ప్రధాన కార్యాలయంలో వర్షాకాల ప్రణాళికపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తుగా రుతు పవనాలు వచ్చే సూచనలు ఉండటంతో అందుకు తగ్గట్లుగా అప్రమత్తమై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి భద్రత సామగ్రి, రెయిన్ కోట్స్, ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

చిన్న మొత్తం.. ప్రగతికి ఊతం

- ఆదరువవుతున్న పొదుపు సంఘాలు
- ఆర్థిక అవసరాలు తీరుస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న శ్రీరాం కాలనీ

షాబాద్‌షరీఫ్: అత్యవసర సమయంలో డబ్బు కోసం ఫైనాన్షియర్ల ముందు మోకరిల్లకుండా తమ ఆర్థిక అవసరాలు తామే తీర్చుకునేందుకు పొదుపు సంఘాలకు శ్రీకారం చుట్టారు జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీవాసులు. రెండున్నర దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ పొదుపు సంఘాలు ప్రస్తుతం ప్రగతి పథంలో నడుస్తున్నాయి. ఇందులో వినాయక పొదుపు సంఘం 25 ఏళ్లు పూర్తి చేసుకొని ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమైంది.

అవసరాలు తీర్చుకునేందుకే..

సంపాదించిన డబ్బులను అప్పులు, వడ్డీలు, ఖర్చులు తదితర కారణాలతో పూర్తిగా ఖర్చు చేయరాదన్న ఆలోచనతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించినంత కాలం నెలలోని ఒక్కరోజు ఆదాయాన్ని సంఘంలో పొదుపు చేయించడం.. పొదుపు డబ్బులను సంఘంలో అవసరమున్న సభ్యులకు తక్కువ శాతం వడ్డీకి ఇవ్వడం చేస్తున్నారు. ఇలా వారి ఆర్థిక సమస్యలను వారే అధిగమిస్తున్నారు. సంఘం నుంచి 65 ఏళ్ల వయసు కలిగిన సభ్యులు విరమణ పొందిన అనంతరం జమ చేసుకున్న పొదుపుపై ఆధారపడి.. జీవిత చరమాంకాన్ని ప్రశాంతంగా గడపాలన్న



సంఘంలోని సభ్యులకు సాయం చేస్తున్న శ్రీ వినాయక పొదుపు సంఘం సభ్యులు (ఫైల్)

ఉద్దేశంతో ఈ పొదుపు సంఘాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

పలు పథకాలు సైతం

ఈ సంఘాల్లో పొదుపుకు సంబంధించి పలు రకాల పథకాలను అందుబాటులో ఉంచారు. సభ్యులకు ఎలాంటి అవసరాలున్నాయో.. ఆ అవసరానికి సంబంధించిన పథకం నుంచి డబ్బులు ఇస్తుంటారు. భాగ్యనిధి, పెన్షన్, కల్యాణ జ్యోతి, భవన నిధి, విపత్సహాయ నిధి, మరణ ఉచిత సహాయం తదితర పథకాలు ప్రస్తుతం ఈ పొదుపు సంఘాల్లో అమలులో ఉన్నాయి. ఆడ పిల్లలున్నవారు మొదటి నుంచి కల్యాణ పథకంలో డబ్బులు జమ చేసుకుంటారు. నెలనెలా కాకుండా సందర్భానుసారంగా పొదుపు చేసే వారి కోసం భాగ్యనిధి పథకం, 65 ఏళ్ల విరమణ పొందిన సభ్యులకు పింఛన్ ఇవ్వడం జరుగుతుంది.

ప్రధాన సంఘాల వివరాలు

ప్రస్తుతం కాలనీలో శ్రీ వినాయక పొదుపు సంఘం, నవ కార్మిక ప్రగతి సొసైటీ, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పొదుపు సంఘం, శ్రీ గణేశ్ వడ్డెర పొదుపు సంఘం, బహుసార్ క్షత్రియ సమాజ్ సంఘ్(ఎంఏసీఎస్), రజక సంఘం తదితర సంఘాలు ఉన్నాయి. ఇందులో 24 మందితో 1999లో ప్రారంభమైన వినాయక పొదుపు సంఘం ప్రస్తుతం 1,600 మంది సభ్యులతో కొనసాగుతోంది. 2005 జనవరి 16న ఏర్పాటు చేసిన శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘంలో 680 మంది సభ్యులుగా ఉన్నారు. 2013లో ఏర్పాటు చేసిన నవ కార్మిక ప్రగతి సొసైటీలో 350 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. 2010 మే 20న ఏర్పాటు చేసిన శ్రీ గణేశ్ వడ్డెర పొదుపు సంఘంలో 200కు పైగా సభ్యులు ఉన్నారు. 2013లో ప్రారంభమైన ఎంఏసీఎస్‌లో 534 మంది సభ్యులున్నారు. ఈ సంఘంలో లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించడం గమనార్హం.

పారదర్శకంగా పద్దులు



ఆర్థిక ఇబ్బందులు లేకుండా మాలో మేమే పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఏటా వార్షిక సభ ఏర్పాటు చేసి పారదర్శకంగా పద్దులు చూసుకుంటాం. ఏడాదికి రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. సభ్యులెవరైనా చనిపోతే అంత్యక్రియల నిమిత్తం రూ.18 వేలు చెల్లిస్తాం. రుణం కూడా మాఫీ చేస్తాం.

– కెంచె లక్ష్మీనారాయణ, వినాయక పొదుపు సంఘం వ్యవస్థాపకుడు

కార్మికుల కోసం..



శ్రీరాం కాలనీలో పెద్ద ఎత్తున ఉన్న పారిశ్రామిక వాడల్లో పని చేస్తున్న కార్మికుల కోసమే సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఆడపిల్లల వివాహం ఉన్న వారికి రూ.50 వేలు రుణంగా ఇస్తాం. ప్రతీ నెల 6న పొదుపు డబ్బులు జమ చేసుకుంటాం. ప్రస్తుతం ఏడాదికి రూ.2 కోట్ల వరకు లావాదేవీలు కొనసాగుతున్నాయి.

– నవపేట ఆంజనేయులు, నవ కార్మిక ప్రగతి సొసైటీ వ్యవస్థాపకుడు

ఎలాంటి అవసరమున్నా..



ఈ రోజుల్లో రుణాలు కావాలంటే ప్రైవేట్‌గా, బ్యాంక్‌ల్లో ఎంత తిరిగినా నిరాశే ఎదురవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పొదుపు సంఘం ఏర్పాటు చేసుకున్నాం. ఆడ పిల్లల పెళ్లి కోసం కల్యాణ పథకాన్ని అందుబాటులో ఉంచాం. సభ్యులంతా క్రమశిక్షణతో పొదుపు చేసుకుంటున్నారు. మాలో మాకు ఎలాంటి అవసరమున్నా రుణాలు తీసుకుంటాం.

– మన్న రవికుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు

సమయానికి యూనిఫాం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అర్బన్, యుఎల్‌బీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారి సైజుల ప్రకారం కుట్టించాలని సూచించారు. జూన్ 7 నాటికి ఒక జత కచ్చితంగా అందేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మెప్మా పీడీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

మీర్‌పేట: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. మీర్ పేట కేశవరెడ్డినగర్‌కు చెందిన ఆనగొంది బాలయ్య (80) కొన్ని రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుమారుడు మాధవదాసు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

కందుకూరు: పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ లబ్ధిపొందాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన శాఖ ఏడీహెచ్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్‌ను సాగు చేసుకోవచ్చన్నారు. చీడపీడల బాధ తక్కువగా ఉంటుందని చెప్పారు. ఎకరాకు 8–12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంటకి ప్రభుత్వం మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు 80–100 శాతం రాయితీ ఇస్తుందన్నారు. మొక్క నాటిన నాలుగేళ్ల వరకు ఎకరాకు రూ.4200 చొప్పున నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నారని తెలిపారు. నాలుగేళ్ల నుంచి 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. వ్యాల్యూ ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని, మండలానికి ఒక ఫీల్డ్ అధికారిని నియమించి నిరంతరం పంట పర్యవేక్షణ జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఏఓ లావణ్య, ఏఈఓలు రాజు, రాఘవేంద్రచారి, నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రోహింగ్యా యువకులపై కత్తితో దాడి

పహాడీషరీఫ్: రోహింగ్యా యువకులపై కత్తితో దాడి చేసిన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ రాయల్ కాలనీలో క్యాంప్–1లో నివాసం ఉంటున్న మహ్మద్ ఫర్హాన్(19), మైనర్లు నజీముల్లా, మహ్మద్ యాసిర్‌లు శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రోడ్డుపై ఉన్నారు. ఇదే సమయంలో కొత్తపేటలో ఫుట్ బాల్ ఆట ముగించుకొని తమ క్యాంప్ వద్దకు వస్తున్న రోహింగ్యా తెగకు చెందిన మహిబుల్లా, మహ్మద్ షర్ఫిక్‌లు బైక్‌పై వస్తున్నారు. వీరిని అడ్డుకుని ఫర్హాన్ గ్రూప్ సిగరేట్ కావాలని అడిగింది. తమ వద్ద లేదని చెప్పినా వినకుండా కత్తితో మహిబూల్లా, షర్ఫిక్‌లపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

శంకర్‌పల్లిలో 'చందన బ్రదర్స్'

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ ప్రజలకు ఎంతో సుపరిచితమైన ప్యాట్నీ సెంటర్ చందన బ్రదర్స్.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో కొత్త బ్రాంచిని ప్రారంభించింది. ప్రముఖ సినీతార నేహాశెట్టి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు శనివారం షోరూంను ప్రారంభించారు. కుటుంబంలోని వారందరికీ కావాల్సిన వస్త్రాలను హోల్ సేల్ ధరలకే అందించనున్నట్లు సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు. షాపింగ్ మాల్ ఓపెనింగ్ ద్వారా స్థానికంగా ఉన్న 150 మందికి ఉపాధి లభించనుందని ప్రకటించారు.



ఆటోట్రాలీ, బైక్ ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కందుకూరు: ఆటోట్రాలీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాలు.. కడ్తాల్ గ్రామ పరిధి బటర్‌ఫ్లై సిటీ వెంచర్‌లో కొలపల్లి సందీప్‌కుమార్(44) సూపర్‌వైజర్‌గా పని చేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. శనివారం ఉదయం హైదరాబాద్‌కు మరో వ్యక్తి రోమియోతో కలిసి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరిగి కడ్తాల్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో శ్రీశైలం రహదారిపై గూడూరు గేట్ ఎస్‌ఆర్‌ఐ కళాశాల సమీపంలో ముందు వెళ్తున్న మహీంద్రాజెన్ ఆటోట్రాలీ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా రైట్‌టర్న్ తీసుకున్నాడు. దీంతో వెనక నుంచి వస్తున్న బైక్ ఆ ఆటోట్రాలీని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో హైదరాబాద్ తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రావణ్ పేర్కొన్నారు.


మృతుడు సందీప్‌కుమార్


తీవ్రంగా గాయపడ్డ రోమియో

డీసీఎం వాహనం బోల్తా

కందుకూరు: మొక్కజొన్న లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన శనివారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కడ్తాల్ నుంచి మొక్కజొన్న బస్తాలను నింపుకుని హైదరాబాద్ వైపు వస్తున్న డీసీఎం వాహనం.. శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా, రోడ్డు జామ్ కాకుండా వెంటనే మరొక వాహనంలో మొక్కజొన్న బస్తాలను నింపి తరలించారు.


చిందర వందరగా పడిన మొక్కజొన్న బస్తాలు